క్లుప్తంగా

చిన్నారికి తల్లిప్రేమ చూపించిన ఎస్సై



తల్లిదండ్రుల నుంచి తప్పిపోయి ఏడుస్తున్న చిన్నారిని లాలిస్తున్న ఎస్సై కృష్ణపావని

సీఎస్‌పురం: తిరునాళ్లలో తప్పిపోయిన ఓ చిన్నారిని ఎస్సై కృష్ణపావని చేరదీసి తల్లి ప్రేమను చూపించి తిరిగి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సంఘటన శనివారం రాత్రి నారాయణస్వామి ఆలయ ఉత్సవాల్లో చోటుచేసుకుంది. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా శనివారం రాత్రి హనుమంతునిపాడు ఎస్సై కృష్ణపావని నారాయణస్వామి ఆలయం వద్ద బందోబస్తు నిర్వహిస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో ఓ చిన్నారి ఏడుస్తూ కనిపించడంతో ఎస్సై కృష్ణపావని ఆ బాలుడిని చేరదీశారు. మాటలు కూడా సరిగా రాని ఆ బాలుడి పట్ల తల్లి ప్రేమను చూపిస్తూ లాలించి, బుజ్జగించి దాదాపు నాలుగు గంటల పాటు తన దగ్గర ఉంచుకుని తర్వాత తల్లిదండ్రులకు అప్పగించారు. చిన్నారి పట్ల ఎస్సై కృష్ణపావని చూపించిన ఆప్యాయతను చూసిన భక్తులు ఎస్సైకి అభినందనలు తెలియజేశారు.



తల్లి ని చూసిన ఆనందంలో చిన్నారి

వెండి శఠగోపురం, దీపారాధన కుందీల బహూకరణ



వెండి దీపారాధన కుందీలు బహూకరిస్తున్న దాతలు

సీఎస్‌పురం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి దాతలు వెండి శఠగోపురం, వెండి దీపారాధన కుందీలు బహూకరించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నర్రా నారాయణరెడ్డి, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా స్వామి దర్శనం చేసుకున్న భక్తులలో కోవిలంపాడు గ్రామానికి చెందిన అరవ నారాయణ, గంగమ్మ దంపతులు స్వామికి రూ.41 వేల విలువైన దీపారాధన కుందీలు బహూకరించినట్లు చెప్పారు. విజయవాడకు చెందిన వింజం సవ్యశ్రీ తండ్రి లక్ష్మీనారాయణ, లక్ష్మిలు రూ.24 వేల విలువైన శఠగోపురాన్ని బహూకరించినట్లు తెలిపారు.

బాబా స్థూపానికి రూ.లక్ష విరాళం



ఎమ్మెల్యే సమక్షంలో విరాళం అందజేస్తున్న కృష్టారెడ్డి

కందుకూరు అర్బన్: మచిలీపట్నం గూడూరు సమీపంలో నిర్మిస్తున్న 108 అడుగుల స్థూపానికి లింగసముద్రం మండలం రాళ్లపాడు గ్రామానికి చెందిన వరికూటి కృష్టారెడ్డి ధర్మపత్ని వరమ్మ రూ.లక్ష విరాళం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి సమక్షంలో ఆదివారం అందజేశారు. లింగసముద్రం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిచ్చపాటి తిరుపతిరెడ్డి, సూరం వేణుగోపాల్‌రెడ్డి, కొండూరి వసంతరావు పాల్గొన్నారు.

టంగుటూరులో వాలీబాల్ టోర్నీ



టంగుటూరులో బహుమతులు అందుకుంటున్న విజేతలు

టంగుటూరు: స్థానిక పురం సెంటర్‌లోని నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు పీడీ అశోక్, అంబేడ్కర్ యూత్ ఆదివారం నిర్వహించారు. ఈ టోర్నీలో 10 టీంలు పాల్గొని పోటాపోటీగా తలపడ్డాయి. మొదటి బహుమతి అంబేడ్కర్ యూత్ టీం, రెండో బహుమతి జమ్ములపాలెం టీం సాధించాయి. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం సభ్యులు నాగరాజు, ఎ.జగదీష్, గ్రీన్ ఇండియా చారిటీ సభ్యులు శ్యాం ప్రసాద్, రాము, నిర్వాహకులు తుల్లిబిల్లి అశోక్‌బాబు, దామతోటి వంశీ, కారుమంచి అనీల్, పిడుగురాళ్ల రాజేష్, బాబీ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం..కమనీయం..



విష్ణుమూర్తి స్వామి, నారాయణస్వామి గ్రామోత్సవం



శ్రీదేవి భూదేవి సమేత విష్ణుమూర్తిస్వామి కల్యాణం

సీఎస్‌పురం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో శనివారం రాత్రి శ్రీదేవి భూదేవి సమేత విష్ణుమూర్తి స్వామి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నారాయణస్వామి ఆలయంలో శ్రీదేవి భూదేవి సమేత విష్ణుమూర్తి స్వామి కళ్యాణం చేపట్టారు. ఆలయ పూజారులు సత్యనారాయణశర్మ, ప్రసాద్‌శర్మల ఆధ్వర్యంలో పూజారులు స్వామి వారి కల్యాణం జరిపించారు.

వైభవంగా స్వామి గ్రామోత్సవం..

శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసులు స్వామి కల్యాణం అనంతరం స్వామిని, నారాయణస్వామి ఉత్సవ విగ్రహాలకు హంస వాహనసేవ చేపట్టారు. అనంతరం స్వామి వారలను పూలతో ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉంచి మిట్టపాలెం, కోవిలంపాడు గ్రామాల్లో గ్రామోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. కోవిలంపాడు గ్రామానికి చెందిన దొనపాటి వెంకటనారాయణరెడ్డి, వెంకటలక్ష్మమ్మ దంపతుల కుమారులు, నారాయణరెడ్డి రమణమ్మ, చెన్నారెడ్డి జయలక్ష్మి, సూర్యనారాయణరెడ్డి వెంగమ్మ దంపతులు ఉభయదాతలుగా వేడుకలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నర్రా నారాయణరెడ్డి, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు వసతి సౌకర్యాలు సమకూర్చారు.

వైభవంగా గండ దీపోత్సవం

ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో గండ దీపోత్సవం శనివారం అర్ధరాత్రి సమయంలో వైభవంగా నిర్వహించారు. దీపాలు చేత బూనిన భక్తులు కోవిలంపాడు వద్ద నుంచి ర్యాలీగా మిట్టపాలెం నారాయణస్వామి ఆలయం వద్దకు చేరారు. అక్కడ స్వామి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామి సన్నిదిలో దీపాలు ఉంచి మొక్కులు తీర్చుకున్నారు. పామూరు, కనిగిరి సీఐలు శ్రీనివాసరావు, పాపారావు, సీఎస్‌పురం, హనుమంతునిపాడు, పామూరు ఎస్సైలు పి.అనీల్‌కుమార్, కృష్ణపావని, సురేష్ యాదవ్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

పామూరు: మండలంలోని పడమటి కట్టకిందపల్లె శ్యామలా కామాక్షి సమేత మల్లేశ్వర స్వామి ఆలయంలో మూడు రోజులుగా జరుగుతున్న మహాశివరాత్రి ఉత్సవాలు ఆదివారం స్వామివార్ల శాంతి కల్యాణంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శివకామేశ్వరరావు శ్యామలా కామాక్షి అమ్మవారి మూలవిగ్రహమూర్తికి అభిషేకం, కుంకుమార్చన, మల్లేశ్వరస్వామికి ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను వేడుకగా మంగళవాయిద్యాల నడుమ కల్యాణ మండపానికి తరలించి వేద మంత్రాలతో శాస్త్రోక్తంగా శాంతికల్యాణం నిర్వహించారు. కల్యాణానికి నల్లమల అనిల్‌కుమార్ దంపతులు ముత్యాల తలంబ్రాలు సమకూర్చారు. భక్తులకు దాత నల్లమల ఆంజనేయులు అన్నదానం నిర్వహించారు. అనంతరం సాయంత్రం స్వామి ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం కనులపండువగా సాగింది. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, గాజులపల్లి వెంకటేశ్వరరెడ్డి, మితికాల నారాయణ పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: మహాశివరాత్రిని పురస్కరించుకొని ఆలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం వేకువజాము వరకు ఉపవాసం ఉండి జాగారం చేశారు. వీరాంపురం అంబా మల్లేశ్వరి ఆలయం, ముప్పళ్లపాడు త్రిపుర సుందరి సంఘమేశ్వర, కొండారెడ్డిపల్లి, నందనవనం, పెద్దగొల్లపల్లి, అగ్రహారం , హనుమంతాపురం బ్రహ్మంగారి, హనుమంతునిపాడు నారాయణస్వామి ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. ఈ సందర్భంగా కుంకుమ బండ్లతో గ్రామోత్సవం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



శాంతి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



వీరరాంపురం శివాలయంలో కుంకుమబండ్లతో గ్రామోత్సవం



గండ దీపాలు చేత భూని నారాయణస్వామి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు



నందనవనం చెరువు కింద సాగుచేసిన తమలపాకుల తోటలు

సిరుల సాగు..!



రైతు రంగయ్య

- రైతులకు ఆదాయ వనరుగా తమలపాకుల సాగు
- తమలపాకుల సాగుకు నందనవనం పేరుగాంచిన గ్రామం
- ఏడాది పొడవునా మంచి ఆదాయం

హనుమంతునిపాడు: తమలపాకుల సాగు సిరులు కురిపిస్తోంది. ఏడాది పొడవునా ఆదాయం వస్తుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని నందనవనం గ్రామం జిల్లాలోనే తమలపాకుల సాగుకు పేరు గాంచింది. ఇక్కడ నాణ్యమైన ఆకు లభిస్తుంది. ఈ ఏడాది సాగు చేసిన తమలపాకుల తోటలు ఆశాజనకంగా ఉన్నాయి.

సంవృద్ధిగా వర్షాలు..

టీడీపీ ప్రభుత్వ హయాంలో వర్షాలు లేక చెరువులు, వ్యవసాయ బోర్లు పూర్తిగా ఎండిపోయాయి. దీంతో గ్రామంలో తమలపాకుల సాగును పూర్తిగా ఆపేశారు. అయితే వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సంవృద్ధిగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో బోర్లు, చెరువుల్లోకి నీరు చేరడంతో రైతులు ఎప్పటి లాగానే తమలపాకులు, అరటి, చెరుకు సాగు చేస్తున్నారు. నందనవనం తమలపాకులు అంటేనే ఈ ప్రాంతంలో పేరు. ఇక్కడ పండించిన తమలపాకులు కర్నూలు, నంద్యాల, ఒంగోలు, గుంటూరు, తెనాలి, బాపట్ల, కనిగిరి, పామూరు, పొదిలి, మార్కాపురం, కంభం ప్రాంతాల వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తారు. ప్రస్తుతం 150 ఆకుల కట్ట రైతుల వద్ద రూ.40 నుంచి రూ.50 వరకు ధర పలుకుతుంది. రైతులు కొప్పు రంగయ్య, కె.లక్ష్మీనారాయణ, కోటయ్య, ఎస్ పెద్ద కోటయ్య, ఎస్ రోశయ్య, కొప్పు వెంకటచెన్నయ్యలు ఒక్కొక్కరు రూ.లక్షకు పైగా ఖర్చు పెట్టినట్లు చెప్పారు. ఇక్కడ పండించిన ఆకుకు మంచి గిరాకీ ఉండటంతో వ్యాపారులు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

ఆశాజనకంగా ఉంది: కొప్పు రంగయ్య, నందనవనం

తమలపాకుల సాగు మా గ్రామానికి జిల్లాలోనే పేరు. నాలుగేళ్ల క్రితం వర్షాలు లేక సాగు చేయలేదు. మూడేళ్ల నుంచి సంవృద్ధిగా వర్షాలు కురుస్తుండటంతో సాగు ప్రారంభించాం. 2 ఎకరాల్లో సాగుకు రూ.4 లక్షలు పెట్టుబడి పెట్టాం. సాగు ఆశాజనకంగానే ఉంది. రేయింబవళ్లు తోటను కనిపెట్టుకొని ఉంటున్నాం. ధర బాగానే ఉంది.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు



పామూరులో శోభాయాత్ర నిర్వహిసున్న నాయకులు, ఆరె మరాఠీలు



గుడ్లూరులో శివాజీ జయంతి నిర్వహిస్తున్న యువకులు

పామూరు: ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు స్థానిక సీఎస్‌పురం రోడ్డులో ఆరె మరాఠీ సంఘం ఆధ్వర్యంలో సంఘం మండల అధ్యక్షుడు జాజం శివాజీ అధ్యక్షతన ఆదివారం ఘనంగా నిర్వహించారు. పలువురు ఆరెమరాఠీ సంఘం నాయకులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు చత్రపతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యంకోసం, భారతదేశ ఔన్నత్యం, హిందూ సంస్కృతి సంప్రదాయాల కోసం ఛత్రపతి శివాజీ కృషి ఎనలేనిదన్నారు. ఈసందర్భంగా పట్టణంలో శోభాయాత్ర నిర్వహించి అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొండిశెట్టి రమణయ్య, సాయి, సురేంద్ర, క్రిష్ణ, వెంకటేశ్వర్లు, పాబోలు శివ, జాజం శ్రీనివాసులు, జగదాబి సునీల్, దయిండే శివశంకర్, మాల్యాద్రి, రామాంజనేయులు, శ్రీకాంత్, మధు, మణికంఠ, రాజేష్ పాల్గొన్నారు.

గుడ్లూరు: ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు ఇన్నమూరి సుధాకర్, సమరసత సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు చలువాది చిన్న, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొత్తూరు శ్రీనివాసులు శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ధీరత్వానికి మారుపేరు, స్త్రీలను గౌరవించి, హిందూ ధర్మానికి వన్నె తెచ్చిన గొప్ప వీరుడు శివాజీ ఆశయాల సాధనకు నేటి యువత కృషి చేయాలన్నారు. అనంతరం స్వీట్లు పంచి పెట్టారు.

వైభవంగా ముగిసిన శివరాత్రి మహోత్సవాలు



సంగీత విద్వాంసులను, కమిటీ నాయకులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

కనిగిరి రూరల్: మహా శివరాత్రిని పురస్కరించుకుని వివిధ ఆలయాల్లో జరిగిన కార్యక్రమాలు ఆదివారంతో ముగిశాయి. ఆదివారం పలు శైవ క్షేత్రాల్లో మహా శివునికి ప్రత్యేక పూజలు చేశారు. దక్షిణాభిముఖం కల్గిన శైవ క్షేత్రాల్లో ఒకటైన కనిగిరి కొండపై కొలువైన విజయ మార్తండేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి కళ్యాణం అత్యంత వైభవంగా జరిగింది. అనంతరం స్వామి నంది వాహనరూఢుడై పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. శనివారం రాత్రి నందనమారెళ్ల, పునుగోడులలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ పాల్గొని మాట్లాడి మహా శివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, ఆలయ కమిటీ నిర్వాహకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమాల్లో వైస్ ఎంపీపీ తిరుపతిరెడ్డి, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు సానికొమ్ము రంగనాయకులరెడ్డి, సంగు సుబ్బారెడ్డి, ఏపీ మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ పెరుగు మురళీ కృష్ణా, తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు. తొలుత పట్టణంలోని బోధి ధర్మ స్కూల్ ఆవరణలో పిరిమిడ్ స్పిర్చువల్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన శివోహం జాగరణ ధ్యానోత్సవం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. స్పిర్చువల్ సొసైటీ కమిటీ నాయకులు రవీంద్ర, పేర్ల లక్ష్మీ, డీవీ సుబ్రహ్మణ్యం , పులి శ్రీను, లింగారెడ్డి, జి.బొర్రారెడ్డి, నర్సారెడ్డి పేర్ల రమేష్, అన్నా రంగనాయకులు, సంజీవయ్యలు ఎమ్మెల్యే బుర్రాను సన్మానం చేశారు. ఈ సందర్భంగా సంగీత విద్వాంసులను, కమిటీ నాయకులను ఎమ్మెల్యే బుర్రా సన్మానించారు.

జగనన్న పాలనలోనే పేదల కలలు సాకారం



జరుగుమల్లిలో అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అశోక్‌బాబు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు

జరుగుమల్లి(సింగరాయకొండ): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే పేదల కలలు సాకారం అవుతున్నాయని, జగనన్నను మరోసారి సీఎంగా చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. జరుగుమల్లి సచివాలయం సెంటర్లో ఆదివారం గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, గ్రామ వలంటీర్లకు ఏర్పాటు చేసిన మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో వరికూటి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో అన్ని మండలాల్లో బూత్ కమిటీ సభ్యులను నియమించేవారని ప్రస్తుతం వారికి బదులుగా గృహ సారథులను నియమించామన్నారు. గృహ సారథులకు పార్టీలో సముచిత స్థానం ఉంటుందన్నారు. సచివాలయ కన్వీనర్లు ప్రభుత్వానికి, గ్రామ కమిటీ కన్వీనర్లు పార్టీకి వారధిలాంటి వారన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి గత టీడీపీ ప్రభుత్వంలో అవినీతిని, జగనన్న ప్రభుత్వంలో కలిగిన లబ్ధిని వివరించాన్నారు. టీడీపీ ప్రభుత్వంలో నీరు–చెట్టు, మరుగుదొడ్లు, ఇంకుడు గుంటలు, నాడెప్ తొట్ల నిర్మాణం పేరుతో కోట్లాది రూపాయలు దోచుకున్నారని విమర్శించారు. ఒక్క పేదవానికి కూడా సెంటు స్థలం ఇవ్వలేదన్నారు. జగనన్న పాలనలో సుమారు రూ.2 లక్షల కోట్లను సంక్షేమ పథకాల రూపంలో ఇచ్చారన్నారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు ప్రజలను ఇబ్బంది పెట్టిన తీరు, ప్రస్తుతం వలంటీర్లు చేస్తున్న సేవలను ప్రజలకు వివరించాలని సూచించారు. టీడీపీ మద్దతుదారుల మనసు మార్చడమే ప్రతి గృహ సారథి, సచివాలయ కన్వీనర్ లక్ష్యమన్నారు. అనంతరం ప్రచార కిట్‌ను జేసీఎస్ మండల ఇన్‌చార్జి తాడికొండ రామచంద్రరావుకు వరికూటి అందజేశారు. గృహసారథులు ఇంటింటికి ప్రచారానికి వెళ్లేటప్పుడు కిట్‌ను తప్పనిసరిగా తీసుకెళ్లాలని సూచించారు. ఎంపీపీ బెల్లం నిర్మల, మాజీ ఎంపీపీ బెల్లం సత్యనారాయణ, పార్టీ నాయకురాలు పల్లా అనూరాధ, ప్రజాప్రతినిధులు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

108 మందికి నేత్ర వైద్య పరీక్షలు

టంగుటూరు: మండలంలోని జమ్ములపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్మార్ట్ విజన్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో వేణుగోపాల్ సహకారంతో ఉచిత నేత్ర వైద్య పరీక్షలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగమాధురి 108 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 20 మందికి శుక్లాల ఆపరేషన్లు అవసరమని గుర్తించామని, ఆపరేషన్ ఉచితంగా చేస్తామని డాక్టర్ తెలిపారు.

రూ.1.80 కోట్లతో రహదారికి మరమ్మతులు



మరమ్మతులు జరుగుతున్న గుడ్లూరు-అమ్మవారిపాలెం రహదారి

గుడ్లూరు: గ్రామీణ ప్రాంతాల రోడ్ల నిర్మాణాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుంది. 10 ఏళ్లుగా గత ప్రభుత్వాలు పట్టించుకోని గ్రామీణ రోడ్ల మరమ్మతులకు ప్రభుత్వం నిధులు కేటాయించడంతో రాకపోకలకు ప్రజల కష్టాలు తీరుతున్నాయి. మండలంలోని గుడ్లూరు–అమ్మవారిపాలెం రహదారికి మరమ్మతులు చేసి పైన తారు వేయడానికి పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ విభాగం కింద రూ.1.80కోట్లతో పనులు చేపట్టారు. గుడ్లూరు నుంచి అడవిరాజుపాలెం, అమ్మవారిపాలెం, ఆర్‌సీ అగ్రహారం గ్రామాలను కలుపుతూ ఏడు కిలోమీటర్లు రహదారి గత 10 ఏళ్ల నుంచి తారు లేచి పోయి గుంతలు మయంగా మారింది. మూడు గ్రామాల ప్రజలు వివిధ పనులు నిమిత్తం ప్రతి రోజు గుడ్లూరు రావాలంటే తీవ్ర ఇబ్బందులు పడేవారు. గత ప్రభుత్వ హయాంలో ఈ రహదారికి మరమ్మతులు చేయించాలని రెండు గ్రామాల ప్రజలు పాలకులకు, అధికారులకు ఎన్ని అర్జీలు ఇచ్చిన ప్రయోజనం లేకుండా పోయింది. ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి ప్రత్యేకంగా చొరవ తీసుకొని ఈ రోడ్డు మరమ్మతులకు రూ.1.80 కోట్ల నిధులు కేటాయించేలా చర్యలు తీసుకున్నారు. దీంతో గత వారం రోజులు నుంచి ముందుగా రహదారిపై ఉన్న గోతులను పూడ్చివేసే పనులు చేస్తున్నారు. గోతులు పూడ్చివేసిన తరువాత రహదారిపై తారు వేస్తామని పీఆర్ ఏఈ హనుమంతురావు తెలిపారు. రహదారి కష్టాలు తీరుతుండటంతో మూడు గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

24న బహిరంగ వేలంపాట

వలేటివారిపాలెం: మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి సంబంధించి వాయిదా పడిన బహిరంగ వేలంపాట ఈ నెల 24న జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి కేబీ శ్రీనివాసరావు తెలిపారు. వేలంపాటలో భాగంగా రెండు కొబ్బరికాయ షాపులు, కొబ్బరిచిప్పలు పోగు చేసుకునే హక్కు, తలనీలాలు, అద్దాలు, ఫొటోల షాపులకు సంబంధించి వేలం జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్న వారు వేలంపాటలో పాల్గొనాలని కోరారు.

విగ్రహ ప్రతిష్టా మహోత్సవానికి ఏర్పాట్లు



నూతన ఆలయ ప్రారంభోత్సవాన్ని పరిశీలిస్తున్న కుందురు తిరుపతిరెడ్డి, కమిటీ నాయకులు

కనిగిరి రూరల్: పట్టణంలోని కేటీఆర్ స్కూల్ వద్ద జరగనున్న లక్ష్మీ నరసింహస్వామి దేవస్థాన విగ్రహ ప్రతిష్టా మహోత్సవానికి ఆలయ కమిటీ ఆదివారం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నాయకులు, కేటీఆర్ విద్యాసంస్థల అధినేత కుందురు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు లక్ష్మీ నరసింహస్వామి విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు జరుగుతాయన్నారు. 26న ఆదివారం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, అంకురారోపణంతో కార్యక్రమాలు ప్రారంభమై వచ్చే నెల 3వ తేదీతో ముగుస్తాయి. రాష్ట్ర వాసవీ సత్ర సముదాయ అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గణపతి, సరస్వతి, లక్ష్మీ నృసింహ ఆలయాల ప్రతిష్టాపన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో సాయిబాబా దేవస్థాన కమిటీ అధ్యక్షుడు దేవకి సుబ్రహ్మణ్యం, ఇస్కాన్ సంస్థ ప్రతినిధి గుత్తి శ్రీధర్, సాయిరాం, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.